ప్రజల మాట ప్రగతి బాట

# ఖానాపూర్ నియోజకవర్గం

## జాన్సన్ నాయక్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్
- ముఖ్య కార్యకర్తలతో సమావేశం

కడెం, అక్టోబర్ 17: ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్‌నాయక్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మండలంలోని కొండుకూర్ ఫంక్షన్ హాల్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత పదేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలన్నారు. సీఎం కేసీఆర్ మూడో సారి సీఎంను చేసేలా ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని కోరారు. ఖానాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేసేలా జాన్సన్‌నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అయా గ్రామాల ఎంపీటీసీలు, ముఖ్య కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్

## ప్రజలకు భరోసాగా బీఆర్ఎస్ మ్యానిఫెస్టో

దస్తురాబాద్, అక్టోబర్ 17 : తెలంగాణ ప్రజలకు భరోసాగా బీఆర్ఎస్ మ్యానిఫెస్టో ఉందని ఎంపీపీ సింగరి కిషన్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ముడికే ఐలయ్య యాదవ్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను హర్షిస్తూ మండలకేంద్రంలో ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి మంగళవారం సంబురాలు జరుపుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గతంలో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని వాటిని సైతం సీఎం కేసీఆర్ అమలు చేశారన్నారు. ఈసారి కూడా మ్యానిఫెస్టోను కచ్చితంగా అమలు చేస్తారని, ప్రజలు పూర్తి స్థాయిలో విశ్వసిస్తున్నారని తెలిపారు. కేసీఆర్ బీమా ప్రజలకు దీమా పథకం ఎంతో అవసరమన్నారు. సౌభాగ్యలక్ష్మి కింద రూ 400 లకే సిలిండర్ పథకాలు పెట్టడం చాలా బాగున్నాయని పేర్కొన్నారు. ఖానాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సంతపూరి శారద- శ్రీనివాస్, ఎంపీటీసీ దుర్గం సునిత-రాజలింగం, ఆయా గ్రామాల సర్పంచ్‌లు దుర్గం శంకర్, నిమ్మతోట రాజమణి-శివయ్య, పీఏసీఎస్ చైర్మన్ రామడుగు శైలజ-రమేశ్‌రావు, ఆత్మ కమిటీ వైస్ చైర్మన్ అప్పని రాజు, నాయకులు దాసరి సుధాకర్, బొమ్మెన గోపి, అర్గుల రాజానర్సయ్య, ఎండపెల్లి గంగన్న, విలాస్ యాదవ్, కమలాకర్ గౌడ్, అల్లాటి రాజేందర్, నన్న రాజు, జోగయ్య పాల్గొన్నారు.



దస్తురాబాద్ : నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు,నాయకులు

## అన్నపూర్ణ దేవీగా అమ్మవారు



ఖానాపూర్ రూరల్ : మస్కాపూర్‌లో చండీయాగం పుజాలు చేస్తున్న భక్తులు

దస్తురాబాద్, అక్టోబర్ 17 : మండలంలో దేవీశరన్నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం మూడోరోజు అమ్మవారు అన్నపూర్ణదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా మండలకేంద్రంలోని కొత్తగూడెంలో గోమాతాకు ప్రత్యేక పూజలు చేశారు.అలాగే మున్యాల గ్రామంలో వరసిద్ధి వినాయక దుర్గామాతా మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వంశీ చార్యులు, నరేశాచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### చండీయాగం పూజలు

ఖానాపూర్ రూరల్, అక్టోబర్17 : మండలంలోని పలు గ్రామాల్లో దుర్గామాతా శరన్నవరాత్రులు కొనసాగుతున్నాయి. మస్కాపూర్ గ్రామంలో దుర్గామాతాకు మంగళవారం మూడో రోజు చండీయాగం నిర్వహించారు. భక్తులు, మహిళలు అమ్మవారికి పూజాలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

## సాదాసీదాగా మండల సమావేశం

ఖానాపూర్ రూరల్, అక్టోబర్ 17 : మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మోహిద్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎన్నికల కోడ్ ఉండడంతో అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించలేదు. సమావేశానికి మండల ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కూడా తక్కువ సంఖ్యలోనే హాజరయ్యారు. వచ్చే సమావేశంలో గ్రామాలకు సంబంధించి పలు అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలను అడిగి తెలుసుకోనున్నట్లు వారు తెలిపారు. ఎంపీడీవో బాలె మల్లేశ్, వైస్ ఎంపీపీ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో బాలె మల్లేశ్

## బీఆర్ఎస్ బూత్ స్థాయి కమిటీ

పెంబి, అక్టోబర్ 17: మండలంలోని అంకెనా గ్రామంలో బీఆర్ఎస్ బూత్ స్థాయి కార్యవర్గాన్ని బీఆర్ఎస్ నాయకుడు జాదవ్ సురేశ్ ఆధమంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దానా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా గుగ్లావత్ రవీందర్, ప్రధానకార్యదర్శిగా బోడరావుసింగ్ ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన సభ్యులు

### ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ముథోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

లోకేశ్వరం, అక్టోబర్ 17: మండలంలోని గడ్‌చాంద గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ సాయన్న తల్లి, కండక్టర్ ముత్యం తండ్రి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విఠల్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుంద్, ఎంపీపీ లలితా భోజన్న, బీఆర్ఎస్ మండల కన్వీనర్ శ్యాంసుందర్, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్ రావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు భుజంగ్ రావు, స్థానిక సర్పంచ్ కపిల్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నారు.

### సకాలంలో పన్నులు చెల్లించాలి



రసీదు అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఖానాపూర్, అక్టోబర్ 17: పట్టణ ప్రజలు, వ్యాపారులు ఆస్తి, ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎం. శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మున్సిపాలిటీలోని పద్మావతినగర్‌లో సిబ్బంది మంగళవారం ఇంటింటికీ తిరుగుతూ పన్నులు వసూలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు బృందాలుగా ఏర్పడి 12 వార్డుల్లో పన్నులు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఖలీల్, సిబ్బంది రాజేందర్, సాయి, రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

### దాడి కేసులో జైలు

కడెం, అక్టోబర్ 17: మండలంలోని పెద్దబెల్లాల్ పంచాయతీ పరిధిలోని మొర్రిగూడెం గ్రామానికి చెందిన వేల్పుల తిరుపతికి ఖానాపూర్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ జతీన్‌కుమార్ జైలు శిక్ష విధించినట్లు కడెం ఎస్ఐ కే రాజు తెలిపారు. గత నెల 29వ తేదీన తిరుపతి తన భార్యతో కలిసి ఆటోలో దేవునిగూడెం నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. అదే సమయంలో పాండ్వాపూర్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఆటోను ఆపి బ్రీత్‌ఎనలైజర్‌తో పరీక్షిస్తుండగా పోలీసులను కొట్టి ఇష్టానుసారంగా మాట్లాడాడు. దీంతో ఆటోను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తుండగా పోలీసులపై దాడికి పాల్పడగా అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులపై దౌర్జన్యం చేసినా, విధులకు ఆటంకం కలిగించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### టిప్పర్ బోల్తా

కుభీర్, అక్టోబర్ 17 : భైంసా-కుభీర్ రహదారిలోని గోడ్సారా గ్రామంలో మొరంతో వెళ్తున్న టిప్పర్ సోమవారం బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవరు కాలు, చేయి విరిగింది. వెంటనే స్థానికులు క్షతగాత్రులను భైంసాకు తరలించారు. జీపీకి సంబంధించిన పనుల్లో భాగంగా భైంసా నుంచి మొరం తరలిస్తున్నారు.

### నేడు సర్వసభ్య సమావేశం

దస్తురాబాద్, అక్టోబర్ 17 : మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 18న ఉదయం 11 గంటలకు ఎంపీపీ సింగరి కిషన్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయ్ భాస్కర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజాప్రతినిధులు, అలాగే సంబంధిత శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సకాలంలో హాజరు కావాలని కోరారు.